క్లుప్తంగా

సాయినాథుడికి పూజలు

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని సద్గురు సాయిబాబా ఆలయంలో గురువారం సందర్భంగా అర్చకుడు బి.సతీష్ శర్మ ఆధ్వర్యంలో భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. భక్తులు సాయిబాబాకి అభిషేకాలు, అర్చనలు చేశారు. రాత్రి ఉంజల్, పల్లకీ, పవళింపు సేవలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూ నేడు

సిద్దవటం : సిద్దవటం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని సిద్దవటం, ఒంటిమిట్ట మండలాలకు సంబంధించి అంగన్‌వాడీ, ఆయా పోస్టులకు శుక్రవారం ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు సిద్దవటం ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ శ్రీదేవి గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. గురువారం కడప ఆర్డీఓ కార్యాలయంలో జరగాల్సిన ఇంటర్వ్యూలు శుక్రవారానికి వాయిదా పడ్డాయన్నారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు కడప ఆర్డీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు.

కార్యకర్త కుటుంబాన్ని ఆదుకుంటాం

చిన్నమండెం : మండలంలోని కొత్తపల్లె గ్రామం శ్రీరాంనగర్ కాలనీకి చెందిన రేపన రమణయ్య కుమారుడు గంగరాజు కిడ్నీల సమస్యతో మృతి చెందగా ఆ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డి అన్నారు. గురువారం మృతిచెందిన గంగరాజు భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మృతుడి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. అనంతరం వైఎస్సార్ బీమా కింద మంజూరైన తాత్కాలిక సాయం రూ.10 వేలను కుటుంబీకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకుడు రమేష్, సర్పంచ్ లక్ష్మిరెడ్డి, ఎంపీటీసీ శ్యాంచంద్ర, వెల్ఫేర్ అసిస్టెంట్ శంకరయ్య, డీలర్ రమణ తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది సమయం పాటించాలి



సచివాలయంలో హాజరు పట్టికను పరిశీలిస్తున్న ఎంపీడీఓ హైదర్ వలీ

రామాపురం : ప్రతి సచివాలయంలో సిబ్బంది, అధికారులు సమయం పాటించాలని మండల అభివృద్ధి అధికారి హైదర్ వలీ అన్నారు. గురువారం మండలంలోని కుమ్మరపల్లె, చిట్లూరు, హసనాపురం, సరస్వతిపల్లె, నల్లగుట్టపల్లె కొత్తపల్లి గ్రామాల్లోని జగనన్న కాలనీల్లో నిర్మాణంలో ఉన్న ఇళ్లను, గ్రామ సచివాలయాలను తనిఖీ చేపట్టారు. మాట్లాడుతూ సచివాలయం ఉద్యోగులు సమయం పాటించాలని, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించి ఎప్పకటిప్పుడు పరిష్కరించాలన్నారు. ఇళ్ల లబ్ధిదారులకు బిల్లులు పెండింగ్ లేకుండా త్వరగతిన నిర్మాణాలు పూర్తి చేయించాలని సూచించారు. లబ్ధిదారులకు సహకరించని సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇండ్లూరు వంకకు మరమ్మతులు



మరమ్మతులు చేస్తున్న దృశ్యం

పెనగలూరు : మండల కేంద్రమైన పెనగలూరు పంచాయతీ ఇండ్లూరు వంక రోడ్డుకు ఉప సర్పంచ్ దేపూరు చిన్న వెంగల్‌రెడ్డి తన సొంత నిధులతో రోడ్డుకు మరమ్మతులు నిర్వహించారు. ఇండ్లూరు నుంచి గుంజన నది వరకు రోడ్డుకు జేసీబీ, ట్రాక్టర్లు ద్వారా మట్టి తరలించి చదును చేశారు.

సచివాలయాలను తనిఖీ చేసిన అధికారులు



సిబ్బందితో మాట్లాడుతున్న అధికారులు

వీరబల్లి : మండలంలోని పెద్దివీడు, తాటిగుంటపల్లి, మట్లి గ్రామ సచివాలయాలను డీఎల్‌డీఓ ఎన్‌వి మూర్తి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎం.మధుసూదన్‌రెడ్డిలు తనిఖీ చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న నవరత్నాల పథకాలు, హౌసింగ్ స్కీం, పలు అభివృద్ధి కార్యక్రమాలు గురించి వారు ఆరా తీశారు.

'రాష్ట్రానికి ఇదేం ఖర్మ కాదు..'

రామాపురం : వైఎస్సార్‌సీపీ దెబ్బకు తట్టుకోలేక తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు 'మాకు ఇదేం ఖర్మ' అంటూ తెలుగుదేశం కార్యకర్తలు తిరుగుతున్నారని జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రచార కార్యదర్శి జాకీర్ హుస్సేన్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయంలో నీలకంఠ్రావుపేట గ్రామం అభివృద్ధి, సంక్షేమంలో దూసుకెళుతోందన్నారు. అది చూసి ఓర్వలేని ప్రతిపక్ష పార్టీ ఉనికి కోసం మాకు ఇదేం ఖర్మ అంటూ గ్రామాల్లో తిరుగుతున్నారన్నారు.

బస్సు నడిచేనా.. అవస్థలు తీరేనా!

- లక్కిరెడ్డిపల్లె, గాలివీడు నుంచి రామాపురానికి సర్వీసులు లేక అవస్థలు
- గత్యంతరం లేక ఆటోలను ఆశ్రయిస్తున్న ప్రయాణికులు
- నిబంధనలకు పాతరేస్తున్న ఆటో డ్రైవర్లు



ప్రయాణికులతో కిటకిటలాడుతున్న ఆటో

రామాపురం : ప్రధాన రహదారుల్లోనూ బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల కేంద్రం నుండి లక్కిరెడ్డిపల్లె వరకు ఎలాంటి బస్సు సౌకర్యం లేకపోవడంతో ఉద్యోగులు, రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. సమయానికి విధులకు చేరడానికి నానా అవస్థలు పడుతూ, పలువురైతే రామాపురం నుంచి లక్కిరెడ్డిపల్లె వరకు ద్విచక్ర వాహనంలో ప్రయాణిస్తున్నారు. ప్రమాదమని తెలిసినప్పటికి కొందరు ఆటోలను ఆశ్రయిస్తున్నారు. ఆటోలో 10 నుంచి 15 మంది ప్రయాణికులు ఎక్కేంత వరకు కదలేడం లేదు. గంటసేపు ప్రయాణికులు ఆటోలోనే వేచి ఉండే పరిస్థితి నెలకొంటుంది. గతంలో రాయచోటి డిపోకు చెందిన బస్సులు రామాపురం నుంచి గాలివీడు వరకు రెండు బస్సులు నడిపేవారని, కడప నుంచి గాలివీడు వరకు కడప డిపోకు చెందిన బస్సు నడుస్తుండేది. దీంతో ప్రయాణికులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రయాణించేవారు. కడపకు వెళ్ళాలంటే లక్కిరెడ్డిపల్లె నుంచి రామాపురానికి వచ్చి వెళ్లాలని, చక్రాయపేట, లక్కిరెడ్డిపల్లె, గాలివీడు తదితర మండలాల నుంచి నేరుగా రామాపురానికి రావాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. దీంతో లక్కిరెడ్డిపల్లె నుంచి రామాపురం రావడానికి రామాపురం నుంచి లక్కిరెడ్డిపల్లెకి పోవడానికి ఎలాంటి బస్సు సౌకర్యం లేదు. దీంతో ఆటో డ్రైవర్‌లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఆటోలు తమ సామర్థ్యానికి మించి ప్రయాణికులను తీసుకెళ్తున్నప్పటికీ అధికారులు, పోలీసులు చర్యలు తీసుకోవడం లేదు. ఏదైనా ప్రమాదం జరిగితేనే అధికారులు మేలుకుంటారని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్సు సౌకర్యాన్ని కల్పించాలి, ఆటోలలో సామర్థ్యానికి మించి ప్రయాణికులను తీసుకెళ్లకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పట్టణాభివృద్ధికి దశలవారీగా పనులు

ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, చైర్మన్ పోలా శ్రీనువాసులరెడ్డి

రాజంపేట : రాజంపేట పట్టణాభివృద్ధికి దశలవారీగా పనులు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి అన్నారు. గురువారం చైర్మన్ పోలా శ్రీనువాసులరెడ్డి అధ్యక్షతన మున్సిపాలిటీ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజంపేట మునిసిపాలిటీ అభివృద్ధికి సంబంధించిన ప్రణాళికలు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి వెళ్లాయన్నారు. ప్రధానంగా పట్టణంలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతను ఇస్తున్నామన్నారు. చైర్మన్ పోలా మాట్లాడుతూ పురపాలక సంఘం ఆధ్వర్యంలో ప్రజలకు మెరుగైన సదుపాయాలను కల్పనే లక్ష్యంగా ముందుకెళ్తున్నామన్నారు. తాగునీరు, పారిశుధ్యం, వీధిలైట్ల ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు చేపట్టనున్నట్లు స్పష్టం చేశారు. సమావేశంలో కమిషనరు జనార్దన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మర్రి రవికుమార్‌తో పాటు పలువురు కౌన్సిలర్లు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో సంక్రాంతి ముందస్తు సంబరాలు

పట్టణంలోని ఇన్‌ఫెంట్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో శుక్రవారం ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించనున్నారు. ఈమేరకు ఎమ్మెల్యే మేడా, చైర్మన్ పోలాలు కలిసి సంబరాల ఏర్పాట్లను పరిశీలించారు. ముగ్గుల పోటీలు, మ్యూజికల్ చైర్స్ పోటీలను నిర్వహించనున్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి పెద్దపీట

నందలూరు(రాజంపేట) : జిల్లాలో మత్స్యకారుల సంక్షేమానికి జగనన్న ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం నందలూరు కన్యకల చెరువు కట్టపై ఫిష్ మార్కెట్ ఏర్పాటు దిశగా నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారుల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని సోమశిల జలాశయంలో లక్షలాది చేప పిల్లలను వదిలామన్నారు. అలాగే నీరున్నా ప్రతి చెరువులోనూ చేపల పెంపకానికి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. నందలూరు సౌమ్యనాథసామి ఆలయంలో బోయలకు అండగా నిలుస్తామన్నారు. బెస్త కార్మికులు నందలూరు కన్యకల చెరువులో చేపలు పట్టుకొని ప్రాచీన కాలం నుంచి జీవిస్తున్నారన్నారు. అటువంటి వారికి ఉపాధి కల్పన దిశగా నందలూరు కన్యక చెరువు కట్టపై రహదారి బాగుతోపాటు చేపలు అమ్ముకునేందుకు వీలుగా సౌకర్యాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సుభాన్, సర్పంచ్ సూర్యనారాయణ, మండల కో–ఆప్షన్ సభ్యుడు కలీం, వైఎస్సార్‌సీపీ నాయకులు అరిగెల నాని, నాగసుబ్బయ్య, సుధాకర్, శ్రీధర్‌గౌడ్, మన్సూర్ అలీఖాన్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయపద్ధతిలో గొర్రెలు, మేకల పెంపకం



గొర్రెల పెంపకం కేంద్రాన్ని సందర్శించినవారితో సహాయ సంచాలకులు డా.ప్రతాప్

రాజంపేట : శాస్త్రీయపద్ధతిలో గొర్రెలు, మేకలు పెంపకం చేపడితే అధిక లాభాలు వస్తాయని రాజంపేట పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు డా.ప్రతాప్ అన్నారు. గురువారం నంద్యాల, ప్యాపిలికి చెందిన గొర్రెల పెంపకందార్లు క్షేత్రస్థాయిలో సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుడతూ సకాలంలో వ్యాధి నివారణ టీకాలుతో నట్టల నివారణ మందులను గొర్రెలకు వాడినట్లయితే పెద్దజీవాలు చనిపోవన్నారు. గొర్రె, మేక పిల్లల్లో మరణాలు తగ్గినప్పుడే గొర్రెల పెంపకందారునికి ఆదాయమన్నారు. కార్యక్రమంలో పశువైద్యులు శరత్‌కుమార్‌రెడ్డి, భాగ్యవతి, శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర గొర్రెల పెంపకందారుల శిక్షణా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

రాయచోటి టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా చేపడుతున్న నిత్యావసర వస్తువుల పంపిణీ లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని అన్నమయ్య జిల్లా సంయుక్త కలెక్టర్ తమీమ్ అన్సారియా గురువారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. జనవరి నెల 1 నుంచి పంపిణీ చేస్తున్న నిత్యావసర వస్తువులలో ప్రతి వ్యక్తికి 5 కిలోల బియ్యం అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే నాణ్యమైన కందిపప్పు కిలో రూ.67లు, అరకిలో చక్కెర రూ.17లు, అంత్యోదయ కార్డుదారులకు మాత్రం అరకిలో రూ.13.50 లకు అందిస్తున్నట్లు వివరించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

సంబేపల్లె : పేకాటరాయుళ్లను గురువారం అరెస్ట్ చేసినట్లు ఎస్.షరీఫ్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు రౌతుంట గ్రామంలోని కుమ్మరపల్లె సమీపంలో పేకాట ఆడుతున్నారని సమాచారంతో పేకాట స్థావరంపై దాడులు నిర్వహించి ముగ్గురు వ్యక్తులతోపాటు వారి నుంచి రూ.1500 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కోడి పందేలు, పేకాట నిర్వహిస్తే చర్యలు



ప్రజలకు సూచనలు చేస్తున్న ఎస్ఐ సుభాష్

చిట్వేలి : సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఎవరైనా కోడిపందేలు, పేకాట నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చిట్వేలి ఎస్ఐ సుభాష్ చంద్రబోస్ హెచ్చరించారు. గురువారం మండల పరిధిలోని నేతివారిపల్లి, సిద్దారెడ్డిపల్లి, నాగవరం, వెంకటరాజుపల్లి, రాజుకుంట, కె.కందులవారిపల్లి గ్రామాల్లో ఎస్ఐ తన సిబ్బందితో కలిసి పర్యటించారు. పండుగను ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని, కోడి పందేలు, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ హెచ్చరించారు. బయట ఊళ్లకు వెళ్లేవారు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్ఐ సూచించారు. హెడ్ కానిస్టేబుల్ కాటమయ్య, సిబ్బంది రెడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

సిద్దవటం : మండలంలో ఘర్షణలకు పాల్పడి శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తులసీ నాగప్రసాద్ తెలిపారు. సిద్దవటం పోలీసుస్టేషన్‌లో గురువారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ సిద్దవటం మండల ప్రజలకు ఆయన సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని ప్రజలు సంక్రాంతి పండుగను సుఖ, సంతోషాలతో జరుపుకోవాలన్నారు. ఎవరైనా జూదం, కోడి పందేలు ఆడినా, మద్యం సేవించి ఘర్షణలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

ముమ్మరంగా పన్ను వసూలు

సిద్దవటం : మండలంలోని మాధవరం–1 గ్రామ పంచాయతీ రెండవ వార్డులో గురువారం పంచాయతీ కార్యదర్శి సుజాత ఆధ్వర్యంలో ఇళ్లు, దుకాణాలకు సంబంధించి పన్ను వసూలు కార్యక్రమం ముమ్మరంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ కార్యదర్శి సుజాత మాట్లాడుతూ మాదవరం–1 గ్రామ పంచాయతీ పరిధిలోని జాతీయ ప్రధాన రహదారి పక్కన ఉన్న కిరాణాషాపులు, మాంసం దుకాణాలు, ఎలక్ట్రికల్ షాపులు, మెడికల్ షాపులు, తదితర వాటికి పన్ను వసూలు చేసి రసీదులను అందజేశామన్నారు. పన్నులు చెల్లించి గ్రామాభివృద్ధి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది ఆనంద్ , శివ, తదితరులు పాల్గొన్నారు.

వరి పంటకు అగ్గి, తెల్ల తెగుళ్లు



వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి రమేష్‌రెడ్డి

సిద్దవటం : వరి పంటకు అగ్గి, తెల్ల తెగుళ్లు సోకినట్లు మండల వ్యవసాయాధికారి కె. రమేష్‌రెడ్డి తెలిపారు. మండలంలోని వంతాటిపల్లె, జ్యోతి, పొన్నవోలు గ్రామాల్లోని వరిపంట పొలాలను గురువారం వ్యవసాయాధికారి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పంట ఆకులపైన అక్కడక్కడ అగ్గి తెగుళ్ల మచ్చలను, తెల్లతెగులు (కాండము తొలుచు పురుగులు) గమనించామన్నారు. వీటి నివారణకు అగ్గితెగులుకు ఐసో ప్రొఫతలెన్(ఫ్యూజీవన్) అనే మందును లీటర్‌కు నీటికి 1.5 ఎంఎల్ చొప్పున, అదే విధంగా కాండం తొలుచు పురుగు నివారణకు కార్‌టాప్ హైడ్రోక్లోరైడ్ 4జి గుళికలను లేదా కార్బోఫ్యూరాన్ 3జి గుళికలను ఎకరాకు 5 నుంచి 10 కిలోలు చొప్పున మట్టితో కలిపి పంటకు చల్లుకోవాలన్నారు. ఇలా చల్లుకోవడం వల్ల ఈ తెగుళ్లను నివారించవచ్చునని రైతులకు తెలియజేశామన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

లావాదేవీలు పుస్తకాల్లో నమోదు చేయాలి



మాహిళా సంఘాల సభ్యులనుద్దేశించి మాట్లాడుతున్న ఖాదర్ వలీ

వీరబల్లి : ఆర్థిక లావాదేవీల సమావేశాలతో సంఘాల్లో పారదర్శకత ఉంటుందని వైఎస్సార్ క్రాంతి పథకం సహాయ ప్రాజెక్టు మేనేజర్ ఖాదర్ వలీ అన్నారు. గురువారం సోమవరం గ్రామ సమాఖ్య కార్యవర్గ సమావేశం వడ్డిపల్లి పాఠశాల ఆవరణలో నిర్వహించారు. ఈ సమావేశంలో అన్ని రకాల లావాదేవీలు నిర్వహించి, లావాదేవీలు పుస్తకాలలో నమోదు చేయడం వలన సభ్యులలో పారదర్శకత పెరుగుతుందని ప్రాజెక్టు మేనేజర్ తెలిపారు. సంఘం లావాదేవీలలో సభ్యులకు భాగస్వామ్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిసి కులాయప్ప, విఓఏ విజయమ్మ, సమాఖ్య అధ్యక్షురాలు గంగాదేవి, సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా ముందస్తు సంక్రాంతి



రాజంపేట: విజేతలకు బహుమతులను అందజేస్తున్న ఏఐటీఎస్ వైస్ చైర్మన్ ఎల్లారెడ్డి



పెనగలూరు: భోగి మంటలు చుట్టూ నృత్యం ఆడుతున్న విద్యార్థినులు, ఉపాధ్యాయులు

రాజంపేట : సంప్రదాయలకు అద్దంపట్టే పండుగ సంక్రాంతి అని ఏఐటీఎస్ వైస్ చైర్మన్ ,వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చొప్పా ఎల్లారెడ్డి అన్నారు. గురువారం ఏఐటీఎస్‌లో అట్టహాసంగా సంక్రాంతి ముందుస్తు సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడూతు సంక్రాంత్రి పండుగ ప్రతి ఒక్కరిలో నూతనోత్సాహం నింపుతుందన్నారు. అంతకముందుగా ఉదయం నుంచి ఏఐటీఎస్ క్యాంపస్‌లో రంగోలి, భోగీమంటలు, గాలిపటాలను ఎగురవేశారు. అలాగే జాతీయ యువజన దినోత్సవ వేడుకలు స్వామి వివేకానంద జయంతిని ఘనంగా నిర్వహించుకున్నారు.

పెనగలూరు : మండలంలోని చక్రంపేట సమీపంలో ఉన్న సాయి వికాష్ పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. భోగిమంట, గొబ్బెమ్మ, ముగ్గుల పోటీలు, వివిధ రకాల సాంప్రదాయ వేషధారణల మధ్య సంక్రాంతి సంబరాలు నిర్వహించుకున్నారు.

వివేకానందుని మార్గంలో పయనించాలి

- యువతకు పలువురు వక్తల సూచన
- ఘనంగా స్వామి వివేకానంద జయంతి



రైల్వేకోడూరు అర్బన్: వివేకానంద చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు



రాజంపేట టౌన్: స్వామి వివేకానంద విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

రాయచోటి అర్బన్ : భారతదేశ ఘనతను ప్రపంచానికి చాటిచెప్పిన స్వామి వివేకానందను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) జిల్లా అధ్యక్షుడు కె.రమణారెడి, రాష్ట్ర సహాధ్యక్షుడు రామమోహన్‌రెడ్డిలు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ప్రతిభ జూనియర్ కళాశాలలో స్వామి వివేకానంద జయంతి వేడుకలను ఆపస్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటియువతకు వివేకానందుడి బోధనలు, ప్రసంగాలు మార్గనిర్దేశనం చేస్తాయంటూ చెప్పారు. 1893 సెప్టెంబ ర్ 11న చికాగోలో జరిగిన ప్రపంచ సర్వమత సమ్మేళనంలో పాల్గొన్న వివేకానందుడి భారతదేశ కీర్తిని ప్రపంచ దేశాలకు చాటారన్నారు. వివేకానందుడి జీవితం యువతకు స్ఫూర్తిదాయకం అన్నారు.

ప్రపంచ దేశాల్లోని యువతకు స్వామి వివేకానందుడు స్ఫూర్తి ప్రదాత అని తహసీల్దార్ రవిశంకర్ రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక సాయి ఇంజనీరింగ్ కళాశాలలో స్వామి వివేకానంద జయంతితోపాటు ముందస్తు సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివేకానందుడి జీవితం యువతకు ఆదర్శమన్నారు. వివేకానందుడి ఆశయాలను ముందుకు తీసుకెళ్ళడమే నేటి యువత బాధ్యత అన్నారు. అనంతరం కళాశాలలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా నిర్వహించిన పోటీలలో విజేతలకు ఆయన కళాశాల ఏడి సుధాకర్‌రెడ్డితో కలసి బహుమతులను అందజేశారు.

ఘనంగా జాతీయ యువజన దినోత్సవం

రాజంపేట టౌన్ : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పోతుగుంట రమేష్‌నాయుడు ఆధ్వర్యంలో జాతీయ యువజన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పురుషోత్తం పాల్గొని యువతను ఉద్దేశించి మాట్లాడారు. యువత స్వామి వివేకానంద చూపిన మార్గంలో పయనిస్తూ, ఆయన సూక్తులను పాటించాలని తెలిపారు. తొలుత స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈకార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు, నాయకులు సాయిలోకేష్, విజయేంద్ర బాబు, ఆదినారాయణ, సుభద్ర, శ్రీనివాసులు, ప్రవీణ్‌కుమార్, ఏబీవీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘణంగా వివేకానంద 161వ జయంతి

రైల్వేకోడూరు అర్బన్ : స్వామి వివేకానంద 161వ జయంతిని రైల్వేకోడూరులో పలువురు గురువారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దల్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అలాగే స్థానిక బీజేపీ కార్యాలయంలో తోట శ్రీనివాసులు ఆధ్వర్యంలో వివేకానందుని చిత్రపటానికి పూలమాలలు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి యువతకు వివేకానంద ఆదర్శం కావాలన్నారు. ఆయన దేశంలోని యువకులలో ఉత్తేజాన్ని నింపారన్నారు.

పోటా పోటీగా క్రికెట్ టోర్నమెంట్

పెనగలూరు : దేపూరు చిన్న వెంగల్ రెడ్డి ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్‌ను ఉత్కంఠగా జరుగుతోంది. గురువారం క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లు జరిగాయి. టోర్నీలో మొత్తం 32 జట్లు పాల్గొన్నాయి. విజేతలకు రూ. లక్ష బహుమతిని అందజేయనున్నారు.

16న ముగ్గుల పోటీలు

మండల కేంద్రమైన పెనగలూరు పంచాయతీ కొత్తపల్లి వినాయక మండలం సమీపంలో ఈనెల 16వ తేదీన మండల వ్యాప్తంగా ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు గిరీష్ రెడ్డి తెలిపారు.

ఈ మొదటి బహుమతి రూ.25 వేలు, రెండో బహుమతి రూ.15 వేలు, మూడో బహుమతి రూ.10 వేలు అందజేస్తామన్నారు. పోటీల్లో పాల్గొనే ప్రతి మహిళకు రూ.1000లు పారితోషికం అందిస్తామన్నారు.

హామీలను నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌దే

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి



లబ్ధిదారుకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

లక్కిరెడ్డిపల్లె : జగనన్న పాలనలో అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు.

గురువారం లక్కిరెడ్డిపల్లె మండలం కోనంపేట గ్రామ పరిధిలో రెండోరోజు కోనంపేట, గొల్లపల్లెల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని స్థానిక ఎంపీపీ సుదర్శన్ రెడ్డి, మాజీ ఎంపీపీ రెడ్డయ్య, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి శ్రీకాంత్ రెడ్డి నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. సంక్షేమ పథకాలు చేరలేదని తమ దృష్టికి వస్తే వెంటనే స్థానిక అధికారులతో చర్చించి వెంటనే అందేలా చూస్తామన్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రి ప్రవేశపెట్టని సంక్షేమ పథకాలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టారని ఎమ్మెల్యే తెలిపారు. జగనన్న పాలనలో ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా పాలన సాగిస్తున్నారని చెప్పారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలను 98శాతానికి పైగా హామీలను నెరవేర్చిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని స్పష్టం చేశారు. కోనంపేట సచివాలయ పరిధిలో వివిధ పథకాల ద్వారా ఇప్పటివరకు రూ. 6.32 కోట్లు లబ్ధిదారులకు ఇచ్చినట్లు తెలిపారు.

ప్రజలతో మమేకం

దొంకలో వీధిలో సీసీ రోడ్డు ఏర్పాటుకు ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. దొంక వీధిలో అదనపు విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేయాలని స్థానికులు కోరగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. నాగూరు హుస్సేన్ బీ అనే వృద్ధ మహిళ తన ఇంటికి విద్యుత్ కనెక్షన్ లేదని తెలపడంతో విద్యుత్ సర్వీసు కోసం ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి స్వయంగా నగదు చెల్లించడంతో అర్ధగంటలో విద్యుత్ కనెక్షన్‌ను అధికారులు అందించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ కర్లపు విశ్వనాథరెడ్డి, ఉప మండలాధ్యక్షుడు సమరసింహారెడ్డి, తహసీల్దార్ నాగ ప్రసన్న లక్ష్మి, ఎంపీడీఓ వెంకటరమణారెడ్డి, పీఆర్‌డీఈ వెంకటరెడ్డి, ఏపీఎస్పీడీసీఎల్ ఏఈ కిషోర్, కో–ఆప్షన్ సభ్యుడు సయ్యద్ అమీర్, నరసింహా రెడ్డి, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

నివాళి అర్పించిన ఎమ్మెల్యే

లక్కిరెడ్డిపల్లె మండలం దప్పేపల్లె గ్రామం, మేడిమాకుల గుంత కొత్తపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు శంకర్‌రెడ్డి మాతృమూర్తి బయమ్మ(95) అనారోగ్యంతో మృతి చెందారు. బయమ్మ మృతదేహానికి గురువారం ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి సందర్శించి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుదర్శన్ రెడ్డి, మాజీ ఎంపీపీ రెడ్డయ్య, వైస్ ఎంపీపీ సమరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాలు గ్రామ స్వరాజ్యానికి ప్రతిరూపాలు



లక్కిరెడ్డిపల్లె: కోనంపేట రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి

లక్కిరెడ్డిపల్లె : గ్రామ స్వరాజ్యానికి ప్రతిరూపంగా జగనన్న ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయాలు నిలుస్తున్నాయని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అన్నారు. గురువారం లక్కిరెడ్డిపల్లె మండలం కోనంపేటలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, ఆర్బీకే కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్ గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి దేశంలో ఎక్కడా లేని విధంగా పారదర్శకంగా, ప్రతిష్టాత్మకంగా గ్రామ స్థాయిలోనే ప్రజలకు సేవలందిస్తున్నారన్నారు. రైతులకు విజ్ఞాన కేంద్రాలుగా ఉన్న రైతు భరోసా కేంద్రాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని సేవలను పొందాలని కోరారు. రైతులు ఆర్బీకేల ద్వారా సలహాలు సూచనలిస్తారన్నారు.

క్రీడా పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే

క్రీడలు మానసిక ఉల్లాసాన్ని, స్నేహ భావాన్ని పెంపొందిస్తాయని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అన్నారు. గురువారం లక్కిరెడ్డిపల్లె మండలంలోని దిన్నెపాడులో జరుగుతున్న వాలీబాల్ సెమీ ఫైనల్ పోటీలను ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథరెడ్డి, దిన్నెపాటి గజేంద్ర రెడ్డి, సర్పంచ్ వలీ, ఉపసర్పంచ్ రఫీ, హస్తకళల డైరెక్టర్ హుస్సేనయ్య, ఎస్‌బిఐ దర్బార్, హబీబ్, పఠాన దర్బార్, అంగడి మీరావలీ, గుండు, బక్షుల్లా, రియాజ్, ఫయాజ్, ఫిరోజ్, అబ్దుల్ మాలిక్, సద్దాం తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

రామాపురం : యువత, విద్యార్థులు క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మోహన్‌రెడ్డిలు అన్నారు. గురువారం రామాపురం, లక్కిరెడ్డిపల్లె మండలాల సరిహద్దులోని దూదేకులపల్లెలో జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్‌ను సందర్శించారు. గ్రామస్తులు, యువకులు ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి క్రికెట్ ఆడి క్రీడాకారులు, యువతను ఉత్సాహపరిచారు.